క్లుప్తంగా

దసరా ప్రయాణికులకు ఆర్టీసీ లక్కీ డ్రా

తొర్రూరు: దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించి నగదు బహుమతులు అందించనున్నట్లు తొర్రూరు డీఎం పద్మావతి తెలిపారు. నేటి నుంచి అక్టోబర్ 6 వరకు రాజధాని, సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి బహుమతులు అందిస్తామన్నారు. ప్రయాణికులు టికెట్ వెనక పేరు, ఊరు, ఫోన్ నంబర్ రాసి డ్రా బాక్సులో వేయాలన్నారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ బహుమతి కింద రూ.10వేలు అందిస్తామన్నారు. అక్టోబర్ 7న వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో డ్రా తీస్తామన్నారు.

జయప్రదం చేయండి



నెహ్రూసెంటర్: అక్టోబర్ 11, 12 తేదీల్లో నల్లగొండ జిల్లాలో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్ జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గుజ్జు కృష్ణవేణి, కవిత, పొన్నం రమ, వల్లాల సోమక్క, అనురాధ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

మహబూబాబాద్ అర్బన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ప్రముఖ కవి, రచయిత ప్రజా వాగ్గేయకారుడు గోడిశాల జయరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు పార్నంది రామయ్య పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఘనపురం అంజయ్య, డాక్టర్ చింతం రమేష్, డాక్టర్ అంబరీష, సతీష్‌రెడ్డి, రమేష్, కిషన్‌నాయక్, మైస శ్రీనివాస్, సంకా బద్రినారాయణ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

కురవి: క్షయవ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బానోత్ నెహ్రూనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 52 మంది క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్‌కుమార్, తహసీల్దార్ విజయ, డాక్టర్లు విరాజిత, సురేష్, సొసైటీ చైర్మన్ హరిప్రసాద్, రవిచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకే ప్రయత్నంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



బయ్యారం: మండలంలోని గంధంపల్లి గ్రామానికి చెందిన నూతనపాటి శ్రీనివాసరావు– సునీత దంపతుల కుమారుడు కల్యాణ్ గ్రూప్–1,2,3,4 పరీక్షల్లో ప్రతిభ కనపర్చి ఎంపీడీఓ, ఏఎస్ఓ, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చిన్న వయసులోనే తండ్రి చనిపోయినప్పటికీ తల్లి ప్రోద్బలంతో పట్టుదలగా చదివి విజేతగా నిలిచిన కల్యాణ్‌ను కుటుంబసభ్యులతో పాటు స్థానికులు అభినందించారు.

నేడు ఉపాధి శిక్షణ సాంకేతిక కేంద్రం ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉపాధి శిక్షణ అధునాతన సాంకేతిక కేంద్రంను నేడు ఉదయం 11గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ బాబు శుక్రవారం తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

మరిపెడ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం మండలం ఎల్లంపేట గ్రామంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అల్వాల పురుషోత్తం, మధుసూదన్, బాణాల రాజన్న, తాడూరు వీరేంకులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో వీరునాయక్ ప్రతిభ

మహబూబాబాద్ రూరల్: మానుకోట కరాటే అకాడమీ చైర్మన్ వీరునాయక్ బ్లాక్ బెల్ట్ ఆరవ డాన్ సాధించారు. జనగామ జిల్లా పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహా స్వామివారి ఆలయ ప్రాంగణంలో షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. ఇందులో వీరునాయక్ అత్యంత ప్రతిభ కనబరిచి ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు.

కంకర పరిచి.. తారు మరిచి

- నిత్యం వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు

పెద్దవంగర: రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజల కష్టాలు రెట్టింపు అయ్యాయి. కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ దుమ్ము, వాహనాల టైర్లు పగిలిపోవడం, ద్విచక్ర వాహనాలు జారి పడటం, చిన్నచిన్న ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. వాహనాలు పల్టీలు కొట్టిన సందర్భాలు, చేతులు విరిగిన సంఘటనలు సైతం ఉన్నాయి. పొలాలకు వెళ్లే రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఆలస్యం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయి. కోట్ల రూపాయల నిధులు మంజూరైన నత్తనడకన సాగుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన పనులు

గంట్లకుంట గ్రామం నుంచి పెద్దవంగర మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై కంకర పోసి వది లేయడంతో వాహనదారులు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారి విస్తరణ కోసం గత ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. పెద్దవంగర నుంచి అమర్‌సింగ్, గంట్లకుంట మీదుగా కాన్వాయి గూడెం వరకు రూ.9.6కిలోమీటర్ల రోడ్డు పనులకు కోట్లు, చిట్యాల నుంచి సూర్యాతండా మీదుగా లొట్లబండతండా వరకు 5.3కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ. 3.30కోట్లు మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనులు చేపట్టిన అవి నత్తనడకను సాగుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించడం మరింత కష్టంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర పోసి వదిలేసిన గంట్లకుంటకు వెళ్లే రోడ్డు



కంకర తేలి ఉన్న లొట్లబండ తండా నుంచి చిట్యాలకు వెళ్లే రోడ్డు

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండల కేంద్రానికి చేరుకోవడం ప్రజలకు ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయడంతో పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. పనులు ఎప్పుడు పూర్తి అవుతాయోనని ఎదురుచూస్తున్నాం. పనులు త్వరగా పూర్తయ్యేలా చొరవ చూపాలి.

– కనుకుంట్ల వెంకన్న, వ్యాపారి

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల: జిల్లా కేంద్రంలో ఈనెల 28న నిర్వహించే లంబాడ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం గార్ల అంబేడ్కర్ భవన్‌లో జరిగిన బంజారా నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మంగీలాల్‌నాయక్, బానోత్ హరిసింగ్‌నాయక్, అజ్మీర వెంకన్ననాయక్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, శివనాయక్, శాంతికుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: లంబాడీల ఆత్మ గౌరవ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ నంగారబేరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రాంమూర్తినాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం గిరిజన తండాలను తిరుగుతూ లంబాడీలను చైతన్య పరిచారు.



గార్ల: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

కురవి: లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేసేందుకు లంబాడాల తడాఖా చూపిద్దామని లంబాడ సంఘం నాయకులు గుగులోత్ రవినాయక్, శ్రీను నాయక్‌లు పిలుపునిచ్చారు.

చిన్నగూడూరు: లంబాడీల ఆత్మగౌరవ బహిరంగ సభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు సురేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మేఘ్యాతండాలో లంబాడ జేఏసీ నాయకులతో పర్యటించారు.

నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

- నియోజకవర్గ సాధన సమితి కన్వీనర్ మేరెడ్డి సురేందర్



మాట్లాడుతున్న మేరెడ్డి సురేందర్

గూడూరు: మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సాధన సమితి కన్వీనర్ మేరెడ్డి సురేందర్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంసీపీఐ(యూ), సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ, వివిధ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నాయకులు కల్సి సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కన్వీనర్ మేరెడ్డి సురేందర్ మాట్లాడుతూ.. 2026లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ ఏర్పాటు చేయబోతున్నాయని గుర్తు చేశారు. అన్ని అర్హతలు, హంగులు కల్గి ఉందని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం నియోజకవర్గ ఏర్పాటు అవసరం ఉందన్నారు. అనంతరం నియోజకవర్గ సాధన సమితి కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మేరెడ్డి సురేందర్, కో కన్వీనర్లుగా జోగ రణధీర్, నూకల సురేందర్, బీరం శ్రీపాల్ రెడ్డి, చీదురు వెంకన్న, ముఖ్య సలహాదారులుగా జలగం సంపత్‌రావు, కత్తి స్వామి, చెల్పూరు వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌లను ఎన్నుకున్నారు.

గిరిజనులను ఆదుకునేందుకే ‘ఆదికర్మయోగి’

కురవి: ఆదివాసీలు, గిరిజనులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ కర్మయోగి పథకాన్ని ప్రారంభించిందని ఆదికర్మయోగి సేవా కేంద్రం జోనల్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివాసీ కర్మయోగి సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గిరిజనులు సంప్రదాయ దుస్తులను ధరించి, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తు ర్యాలీ చేశారు. గ్రామంలో తిరిగి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దేశీరాంనాయక్, ఏటీడబ్ల్యూఓ భాస్కర్, తహసీల్దార్ విజయ, ఎంఈఓ బాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, ఫారెస్ట్ బీట్ అధికారి శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దుర్గారావు, భద్రు, జీవన్, మగమ్మ, రామారావు, వెంకటరమణ, కృష్ణవేణి, అరుణ, సంగీత పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గిరిజనులు

వృత్తి విద్యా విద్యార్థులకు శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ జూనియర్ ఒకేషన్ కళాశాల వృత్తి విద్య కోర్సు విద్యార్థులకు శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు అన్నారు. మోడల్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని పలు షాపులను శుక్రవారం సందర్శించారు. 10 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు.

విద్యావ్యవస్థను గందరగోళం చేస్తున్న సీఎం



మాట్లాడుతున్న రమేశ్

మహబూబాబాద్ అర్బన్: విద్యారంగంపై సీఎం ప్రకటనలు విద్యా వ్యవస్థను గందరగోళం పరిచేలా ఉన్నాయని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుబ బాలాష్టి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ సంఘ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు భిక్షపతి అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే కొత్తగా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తల అభిప్రాయాలను తీసుకొని, విద్యారంగం బలోపేతానికి సరైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి సరెడ్డి రామలింగారెడ్డి, నాయకులు సిరిరామ్, నరేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టివేత

నెల్లికుదురు: మండలంలోని మేచరాజ్‌పల్లి శివారులో ఓ బడా ట్రాలీ ఆటోలో అక్రమంగా తీసుకెళ్తున్న నల్లబెల్లంతోపాటు పటికను పట్టుకొని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు తెలిపారు. చిత్తూరు నుంచి నల్లబెల్లం, పటికను ఇనుగుర్తి పరిసర తండాలలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. మేచరాజ్‌పల్లి వద్ద ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా అందులో 60బస్తాల నల్లబెల్లం, 2బస్తాల పటిక ఉన్నట్లు తెలిపారు. ఇనుగుర్తి మండలం లాలుతండాకు చెందిన గుగులోతు సురేష్, భూక్యదానియాతండాకు చెందిన భూక్య సిద్ధు, తమిళనాడుకు చెందిన డ్రైవర్ భూపతి గుణసేకర్‌గా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న నల్లబెల్లం, పటిక విలువ రూ.3,10,000 ఉంటుందని పేర్కొన్నారు.

కురవి: అక్రమంగా బైక్‌పై రెండుబస్తాల నల్లబెల్లం, ఐదు కేజీల పటిక, రెండు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా మండలంలోని మోద్గులగూడెం శివారు జుజూర్ తండా వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై సంతోష్ తెలిపారు. జుజూర్ తండాకు చెందిన బానోత్ నరేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రెండు బస్తాల నల్లబెల్లం, ఐదు కేజీల పటిక, రెండు లీటర్ల నాటుసారా తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నరేష్‌కు నల్లబెల్లం కురవి మండలానికి చెందిన ఇస్లావత్ శ్రీను అనే వ్యక్తి అందించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



నెల్లికుదురు: పట్టుకున్న బెల్లం వాహనం చూపుతున్న పోలీసులు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

మహబూబాబాద్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పంచాయతీ కార్మికులను పండుగ పూట పస్తులు ఉంచడమేనా ప్రజాపాలనా అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మొయినొద్దీన్, అప్పిరెడ్డి, సుదాకర్, లతీఫ్, అశోక్, ఉపేంద్రాచారి, లచ్చయ్య, ప్రసాద్, నవీన్, గణేష్, రామకృష్ణ, బాబు, సైదులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



మహబూబాబాద్ రూరల్: స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు



డోర్నకల్: ఉయ్యాలవాడలో..

శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు నిర్వహిస్తూ భక్తులు భక్తిస్ఫూర్తితో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



పెద్దవంగరలో..

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



బయ్యారం: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



గూడూరు: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దంతాలపల్లి: నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రంలో..



డోర్నకల్‌లో..

సంక్షిప్త సమాచారం

చెరువుల పరిశీలన

గూడూరు: మండలంలోని ఏపూరు చెక్‌డ్యాం, దామరవంచ ఊర చెరువు, పాకాలవాగు, బొల్లెపల్లిలోని ఐడీసీ స్కీం పనులు, సుద్దరావుల చెరువులను శుక్రవారం ఐబీ ఎస్ఈ రామకృష్ణ, ఈఈ వీరస్వామి సందర్శించారు.

పేదలకు ఇళ్లు అందించకపోవడం సరికాదు

తొర్రూరు: పేదలకు ఇళ్లు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులో నిరసన కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, దర్గయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతి నివేదిక పత్రిక ఆవిష్కరణ

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆర్టీసీ ప్రగతి నివేదిక పత్రికలను, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ టూర్ ప్యాకేజ్ ఆఫీసర్ ఆర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, రావుల మురళీ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరంలాంటిదని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. శుక్రవారం సీరోలు మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుగగా డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ మహేందర్ రెడ్డి శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు.

నూతన ఫీడర్‌తో లోఓల్టేజీకి పరిష్కారం

బయ్యారం: మండలంలోని కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పందిపంపుల ఫీడర్‌తో లోఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయేందర్‌రెడ్డి అన్నారు. రూ.25లక్షలతో ఏర్పాటు చేసిన ఫీడర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ విజయ్, ఏడీఈలు రమేష్, లోక్‌నాథ్ రెడ్డి, ఏఈ సుమన్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం

తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో వారంరోజులుగా కొనసాగిన ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది చివరిరోజు బతుకమ్మలతో ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ, మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధి సిరికొండ విక్రమ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడ: రానున్న మూడు రోజులు అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులు రైతులు వ్యవసాయ పనులు, చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

చోరీ కేసు నమోదు

గూడూరు: మండల కేంద్రంలోని మూసిన సినిమా థియేటర్‌లో కొనసాగుతున్న రుత్విక్‌సాయి వైన్స్‌లో బుధవారం రాత్రి జరిగిన చోరీపై శుక్రవారం షాపు యజమాని పూనె ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం రుత్విక్‌సాయి వైన్‌షాపులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. షాపు యజమాని ఫిర్యాదు మేరకు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, అందులోని మొత్తం మందు బాటిళ్లతోపాటు ఒక ల్యాప్‌టాప్ పట్టుకుపోయినట్లు గుర్తించారు. మద్యం బాటిళ్లు, ల్యాప్‌ట్యాప్ విలువ మొత్తం రూ.1,98,700 ఉందని ఎస్సై తెలిపారు.

రైలునుంచి జారిపడి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. 108 ఈఎంటీ భిక్షపతి, పైలట్ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలం కొత్త ఇరుసులాపురం గ్రామానికి చెందిన కల్కినేని సంపత్ వరంగల్ నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్నాడు. సింహపురి రైలు అనుకుని వరంగల్ రైల్వే స్టేషన్‌లో సంపత్ మరో రైలు ఎక్కాడు. ఈక్రమంలో వెళ్తున్న రైలు దిగే ప్రయత్నం చేయగా ఎడమ కాలు తెగిపోయి తీవ్రగాయమైంది. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు 108వాహనం ద్వారా సంపత్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

పిల్లల భవిష్యత్‌కు బాటలు వేయాలి

గూడూరు: విద్యార్థి దశ నుంచే వారి బంగారు భవిష్యత్‌కు తల్లిదండ్రులు, అధ్యాపకులు బాటలు వేయాలని ప్రిన్సిపాల్ ఆర్.పరశురాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు పిల్లల విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై సమావేశం ఏర్పాటు చేశారు. గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అన్ని రకాల మౌళిక వసతులతో అందుబాటులో ఉందన్నారు. పిల్లలు ప్రతీ రోజు కళాశాలకు వస్తున్నారా లేదా వారి అలవాట్లపై శ్రద్ధ చూపాలన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల నిఘా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థుల చదువులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉండాలని, క్రమం తప్పకుండా కళాశాలకు వస్తున్నారో లేదో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగిరెడ్డి, నాయిమ్‌పాషా, సురేందర్, సాహిద్, హసీనాబేగం, హాల్‌నాయక్ పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం మాట్లాడుతూ. బాలికలు ఉన్నత చదువులతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలు



గూడూరు: అంగన్‌వాడీ కేంద్రంలో..



కురవి: తాళ్లసంకీసలో..

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ఆస్పత్రులో బతుకమ్మ ఆడి సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్